# బంధువు

రాత్రి పన్నెండు దాటి ఉండవచ్చు. తెల్లవారేటప్పటికి గమ్యస్థానం చేరుకోవలసిన బస్సు కదలలేక కదలలేక ఊగి పోతూ, సాగిపోతోంది మెల్లగా, అతిమెల్లగా. బయట తుపానుహోరు భయంకరంగా విరుచుకుపడిన పిశాచాల మూలుగులా ఉంది. కుండపోతగా వర్షం ఏకధారగా కురుస్తోంది. మిణుగురుల కాంతికూడా లేని కారడవి రోడ్డులో ఎక్కడ ఏ చెట్టు ఎదురవుతుందో, ఏగుట్ట దారికడ్డమౌతుందో అని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని పోతోంది బస్సు. డ్రైవరు కళ్ళు సూదుల్లా బస్సు దీపాలను చూస్తున్నాయి.

"ఎంత తుపాను! ఇంత గాలివానయితే ఈవాళ్టికి బస్సు ఆపేసే ఉందుము. బయలుదేరి నష్టపడేమీ లేదు" అని గొణుక్కుంటున్నాడు కండక్టరు మఫ్లర్ను చెవలమీద సరిదిద్దుకుంటూ. కిటికీ తెరలను ఛేదించుకుంటూ ఉరికి ఉరికి వస్తూన్న వానధారలకు, గాలి విసురులకు దాసోహమని కంబళ్లు దగ్గరగా లాక్కుని, ముడుచుకు కూర్చున్నారు నేలచూస్తూ, దేవుని ప్రార్థిస్తూ ప్రయాణీకులు. కొందరు కళ్లుమూసుకుని కునికి పాట్లు పడుతున్నారు. అదృష్టం! బస్సుకు వెనుక వేపు తలుపుకూడా లేదు. ఎప్పుడో ఊడిపోయింది. తుపానుగాలి దయ తలచినంత లోపలికి రావచ్చు. ఆ తలుపు కెదురుగుండా, నెరసిన గడ్డం, మాసిన తలతో తాత. కండక్టరు ఎన్నడూలేని జాలితో అన్నాడు. "అక్కడెందుకు సామీ లోపలికి రండి ప్రమాదం" అని. తాత వినిపించుకోలేదు. వేదాంతం మాట్లాడుతున్నాడు.

"ఎవరి అదృష్టాని కెవరు కర్తలు? గీత బాగుంటే తుపా నేంచేస్తుంది ? మనిషన్నవాడు——" ఇంకా ఏదో చెపుతూనే ఉన్నాడు ఉపన్యాస ధోరణిలో చలికి వణుకుతూ.

ఎవరూ వినిపించుకోవడం లేదు. అసలు అతను మాట్లాడు తున్నాడనే ఎవరూ పట్టించుకోలేదు. అతనిగొంతు తుపాను హోరులో ఒక భాగంగా ఉంది.

దూరంగా ముందుసీటులో కళ్లుమూసుకుని దేవునిమీద భారంవేసి, ఏ ఆలోచనలు లేకుండా కూర్చున్న సుందరానికి ఆమాటలు, ఆ గొంతు ఏదో కలలోలా వినిపిస్తున్నాయి. అతని వేదాంత వాక్యాల వెనక ఏదో వేదన, తీరని పరితాపము ధ్వనిస్తున్నాయి. పరధ్యానంగా ఈ గొంతు ఎక్కడ విన్నాను. ఇదేదో పరిచయమైన ధ్వనిలా ఉంది అని, ఆలోచనలో మునిగాడు సుందరం.

"పక్క పల్లెలో బస్సు ఆపివేస్తే మంచిదేమో. ఇదెక్కడి తుపాను !" అని గొణుక్కున్నాడు మళ్ళా కండక్టరు.

♦ ♦ ♦

సుందరానికి కునుకుపాటు కలిగింది. ఆ కునుకులో ఆ తాత గొంతు ఎక్కడికో పాతికేండ్ల క్రిందటికి లాక్కుపోయింది. అప్పుడు స్ఫురించింది, ఆ గొంతు ఎవరిదో ! అది తనమేనేజరు గొంతులాగే ఉంది. అప్పుడు లేని వణుకు ఏదోఉంది కొద్దిగా. అప్పుడు లేని ఆవేదనఏదో ఉందికొద్దిగా, ఆ గొంతులో కరుకుదనం ఏమైపోయింది?

ఆరోజులు గుర్తుకు వచ్చాయి, ఒకటొకటిగా పేర్చిన దొంతరలకు మల్లే. అప్పుడే తాను హైస్కూల్లో చదువుముగించాడు. ఇంకా చదవాలన్న కోరికా లేదు, అవకాశమూ లేదు. తండ్రి జబ్బుమనిషి. దారిద్ర్యము తోడునీడ. తల్లి చిన్ననాడే పోయింది, ఆమె అవధిలేని మమత ఒక మూగజ్ఞాపకంగా మాత్రమే తనకు వదలి. తాను ఉద్యోగంలో చేరితేనే గాని బ్రతుకు గడవదు. అప్పుడు అంతకన్నా వేరే ఆలోచన లేదు. పొరుగింటి లక్ష్మణదాసుగారికి తనమీద ప్రేమ. కుర్రవాడు బుద్ధిమంతుడు, నోరు మెదపడు అని. ఆయన తనకంపెనీలో ఉద్యోగ మిస్తానన్నాడు, మేనేజరు క్రిందగుమాస్తాగా. అప్పుడు మేనేజరు ఈయనే. రంగారావు అప్పుడు అతిగంభీరంగా ఉండేవాడు. మనస్సులో ఏమనుకుంటున్నాడో భగవంతునికే తెలియాలి. ఏవో ఎన్నో గుట్టుగా దాచి, మేకతోలు కప్పుకున్న పులిపిల్లలా, కనిపించేదంతా నిజంకాదు సుమా అన్నట్టుండేవాడు. ఆయనకు తాను గుమాస్తాగా రావడం ఇష్టంలేదు. కారణం ఏమిటో అప్పుడు తనకు తెలియదు. ఆయన బంధువునెవరినో తెచ్చుకోవాలను కున్నాడు, తన సొంత వ్యవహారాలలో సహాయకారిగా ఉండడానికి అన్నారు. లక్ష్మణదాసు కది ఇష్టంలేక కాబోలు తనను వేసుకున్నాడు.

మొదటి రోజు నుంచి మేనేజరు కాఠిన్యమే చూపించాడు. పని ఎల్లా చెయ్యాలో చెప్పలేదు. చేసినదాంట్లో నలుసులు ఏరినట్టు తప్పులుఏరి విరుచుకు పడేవాడు. అదేదో నరక

యాతన అయింది. అయినా తను ధైర్యంగానే చాతనయినంత వరకు చక్కగా చేయడానికి ప్రయత్నించాడు.

మేనేజరు సంతోషించలేదు. ఎలాగైనా తన్ను వదల్చుకోవాలన్న కోరిక అతనిలో బలమైనట్టున్నది. అతనిబుద్ధి మొదటి నుంచి ఆలోచనతోనే సతమతమౌతోంది కాబోలు!

ఒక రోజు తనగదిలోకి పిల్చాడు. ఏవో కాగితాలు ఇచ్చాడు కాపీలు వ్రాయమని. ఇవి చాలా రహస్యమైనవి. ఇక్కడే కూర్చుని రాస్తూ ఉండు. నే నిప్పుడేవస్తానని వెళ్ళిపోయాడు. తను ఆపనిలో లీనమై రాసుకుంటున్నాడు. సాయంత్రందాకా అతను రాలేదు. అందరూ ఆఫీసు వదలి వెళ్ళినా తాను అక్కడే ఉన్నాడు. అప్పుడు వచ్చాడు.

వస్తూనే కంగారుగా, "తాళాలు ఇక్కడ మరచిపోయినట్లున్నాను. చూశావా ?" అన్నాడు. తానుతలయెత్తి అమాయకంగా "లేదే" అన్నాడు. అతను బల్లమీద ఉన్నవి తీసి చూపించాడు.

"ఇవిగో ఇక్కడ ఉన్నాయే !" అని. తాను తెల్లపోయాడు. "చూసే చూడనట్లు చెపుతున్నావ్" అన్నాడాయన కటువుగా. ఆతరువాత తనఎదుటనే బీరువా తెరచి "ఇందులో మూడువేలు పెట్టాను కనపట్టంలేదు" అని కంగారు పడ్డాడు. ఆ గదిలో ఒంటరిగా తానుతప్ప ఇంకెవరూ లేరు. తాను అక్కడికి రావడం, అక్కడ ఉండడం, మేనేజరు వెళ్ళిపోవడం ఆఫీసులో అందరూ చూసినదే. ఆ దొంగతనం సులభంగా తన నెత్తిన పడింది. ఎవరూ తనకు సహాయం చెయ్యలేదు. డబ్బు

ఎలాగనూ తిరిగి తాను కట్టలేడు. ఉద్యోగంపోయింది. జైలుకు వెళ్ళక తప్పలేదు. తానుజైల్లో ఉండగానే తండ్రిదిగులుతో కన్నుమూశాడు. తీరనివ్యథతో, తొలగని మచ్చతో తాను అణగారిపోయాడు. ఏమై యుండేదో ఆ నిమిషాన దూరాన ఉన్న మేనమామ, సంగతి తెలుసుకుని సహాయపడ్డాడు. తనను ప్రయాసపడి జైలునుంచి విడిపించాడు. తనకు కమలతో పెళ్ళి చేశాడు. దూరంగా ఈ ప్రాంతంలో ఉద్యోగం చూపించాడు. మళ్ళా కొన్నాళ్ళకు తన జీవితం ప్రశాంతమైన ప్రవాహంగా మారింది. ఎంతో దూరంగా ఆ కథ పీడకలగా నిలిచి పోయింది. ఎప్పుడోగాని గుర్తురాదు. వచ్చినా అదిముల్లులా గుచ్చుకోదు.

◆ ◆ ◆

బస్సు ఒక్క ఊపుతో ఎగిరిపడి ఆగిపోయింది. భయంకరమైన ధ్వనితో ఎదట ఒక పెద్దమాను విరుచుకు తోవకడ్డంగా పడింది. సుందరం తల ముందరసీటు అంచుకు బలంగా కొట్టుకుంది. తానుఎప్పుడు నిద్రపోయాడో, ఎంతసేపయిందో ఏమీ తెలియలేదు. బస్సులో ప్రయాణీకులంతా ఆ ఉదుటుకు ఒకరి నెత్తిన ఒకరు పడ్డారు. మళ్ళామెల్లిగా తేరుకుంటున్నారు. డ్రైవరు నిశ్చేష్టుడై కదలకుండా కూర్చున్నాడు, ఏంజరిగిందో తెలియనట్లు. కండక్టర్ అంటున్నాడు "చెట్టు అటువేపుఅడ్డంగా పడింది. అది అదృష్టం. ఇంక ఈ బస్సు ఇప్పుడు కదలదు. తెల్లవారే వరకు ఎదురు చూస్తూ కూర్చోవలసిందే. ఎల్లాజరగాల్సి ఉంటే అల్లా జరుగుతుంది" అని. ఆమాటకు అందరూ బిక్కమొగాలు వేసుకున్నారు. అప్పుడు చూసుకున్నారు. అందరికి

ధైర్యంగా ఇంతసేపు వేదాంతం మాట్లాడుతున్న తాత ఏడీ? ఏమైనాడు ? అని.

కండక్టర్ తిరిగిచూచాడు. కొంచెందూరంగా స్పృహ తప్పి పడిఉన్నాడు. కణత దగ్గర రక్తం కారుతోంది. అందరూ కలసి మళ్ళా బస్సులో వెనకసీటులో పడుకోబెట్టారు. తడి గుడ్డతో రక్తం తుడిచారు. ముందరసీటులో ఉన్న సుందరం వెనక్కివచ్చిదగ్గరగా కూర్చున్నాడు. ఎంతోదిగులుతో "పాపం, పెద్దవాడు, ఏమైపోతాడో" అన్నాడు. ఎప్పుడోపరిచయమున్న వ్యక్తి ఏదో బంధువులా తోచింది. క్షణకాలం అతని వాగ్ధోరణి వింటే అతని మీద తన కేదో ఆప్యాయత కలిగింది. ఆమాటలలో తన కేదో పరితపిస్తున్న ఆత్మ గోచరించింది. పాతికేళ్ళ క్రిందట అతనెవరో, తానెవరో, జరిగిం దేదో అంతా కలలా ఉంది. అది తన నిప్పుడు కదిలించడం లేదు.

కండక్టర్ చెప్పాడు. "ఈయన రంగయ్యండి. మాజిల్లా వాడే ! ఎప్పుడో అక్కడమంచి ఉద్యోగంలోనే ఉండేవాడట. చాలా రోజులైంది. ఉద్యోగం పోయింది. భార్యా, కూతురూ పోయారు. ఆస్తి పోయింది. పాపం మతి స్థిమితం లేదు. అల్లా గమ్యం లేకుండా ఊరికే బస్సులో తిరుగుతూఉంటాడు. ఏదో వాగుతూ ఉంటాడు. దగ్గరేదైనా ఉంటే ఎవరైనా అడిగితే ఇచ్చేసి పోతుంటాడు. పాపం, అయిన వాళ్ళెవరూ లేరు కాబోలు! అలా అలా ఒక్కడే ఎప్పుడూ తిరుగుతాడు. ఇప్పుడు ఇంతదూరం ఎందుకొచ్చాడో ఏమో !" అన్నాడు మళ్ళా నిర్లక్ష్యంగా బీడీ ముట్టించు కున్నాడు.

కథా నిలయం
646
శ్రీకాకుళం

సుందరానికెందుకో కళ్ళనీళ్ళు వచ్చాయి. తనకపకారం చేసిన వ్యక్తిమీద, ఈ జాలి ఏర్పడట మేమిటి ? అసహజం : కాని ఆ వ్యక్తి వేరు. ఈ వ్యక్తి వేరు! ఆ రోజులు వేరు. ఈ రోజులు వేరు! ఎక్కడా పోలికలే లేవే. తానూ అంతే! అప్పుడు లోకాన్ని చూసి చెదిరిపోయిన మనిషి ఇప్పుడు లేడు. ఎవరిని చూసినా జాలిపడే వ్యక్తి ఎవరో ఇప్పుడు తనలో నివసిస్తున్నాడు. ఎప్పుడు ఎలా ఈ రూపు పొందాడో! ఆ జైలుజీవితం ఒంటరితనం. తనలో నిస్పృహ నింపి తనకు జాలి నేర్పింది కాబోలు!

జీవితం చిత్రంగా ఉంటుంది ! ఒకనాడు నిరాధారంగా దుఃఖము, అవమానమూ మాత్రమే సహచరులుగా ఉన్న తాను, ఇవ్వాళ సుఖదుఃఖాల కతీతంగా, ప్రశాంతంగా కాలం గడుపుతున్నాడు. కమల కన్నులలో తనకేదో ఊరట! ఆనాడు అధికారం, అహంకారం గూడుకట్టుకున్న ఈ వ్యక్తి, ఈనాడు అతి దీనంగా, ఏకాకిగా ఎవరైనా జాలి చూపుతారా అని అటమటిస్తున్నట్లున్నాడు! ఏ నిమిష మెటువంటిదో!

♦ ♦ ♦

తెల్లవారింది. బస్సు గమ్యం చేరుకుంది. అందరూ దిగి వెళ్ళిపోయారు. తాత ఇంకా మగతగానే ఉన్నాడు. మాట్లాడటంలేదు. "ఈయన్నేం చెయ్యాలి" అనుకున్నాడు కండక్టరు గట్టిగా తనలో తాను. సుందరానికి వదలివెళ్ళడానికి బుద్ధిపుట్ట లేదు. ఏ ఆసరా లేకుండా ఎలా ఉంటాడు ! ఎందుకు తనతో తీసుకుపోకూడదూ అనుకున్నాడు. కొంచెం కోలుకుంటె తరు

వాత ఆయన ఇష్టం ! ఇంటికి తీసుకుపోతే కమల ఏమీ అనదు వింతగా కళ్ళు విప్పుకు చూస్తుంది. మళ్ళా మామూలుగా. ఊరుకుంటుంది. ఆమె కసలు ఏవిషయంలోను ఎప్పుడూ ఏఅభి ప్రాయాలు లేవు. తాను నవ్వితే, ఆమె నవ్వుతుంది. తానుదిగులుగా ఉంటె, ఆమె ముఖం ముడుచుకుంటుంది. బెంగగా చూస్తుంది. తన ముఖంలో భావమే ఆమె ముఖంలో ప్రతిఫలిస్తుంది. అంతే. ఆమె ఒడిలో ముఖం దాచుకుంటె తనకు ప్రశాంతి నెలకొన్నట్లుంటుంది.

కండక్టర్‌తో అన్నాడు “బండి తీసుకువచ్చి ఈయన్ను నేను తీసుకుపోతాను మాఇంటికి” అని. కండక్టర్ తెల్లపోయాడు. “మీ ఇంటికా! ఈయన మీ బంధువా?” అన్నాడు. అవునన్నట్టు తలఊపాడు సుందరం.

అతను ఆ రోజంతా మగతగానే వున్నాడు. ఆ మగతలోనే ఉండి ఉండీ కలవరించాడు. “ఒక అమాయకుడికి అపకారంచేసి ఏం బావుకున్నాను ? ఆశల మేడలు కట్టుకున్నాను. ఏమైంది ? సంపాదించిందంతా కలలాకరగిపోయింది. అమ్మాయి తన దోవనతాను వెళ్ళి పోయింది. అదీ కన్నుమూసింది, అమ్మాయికోసం ఏడ్చిఏడ్చి. ఎందుకూ, నేను మిగిలిఉన్నాను?”

ఈ మాటలు అస్పష్టంగా మూలుగులో కలిసిపొయ్యేవి. సుందరానికి వినగా వినగా జాలి ముంచుకు వచ్చేది. అతనికి కొద్దిగా స్పృహ ఉన్నప్పుడు చెప్పాడు, తాను ఎవరో! “నన్ను గురించి బాధపడనద్దు, నేనేమీ బాధపడటంలేదు” అన్నాడు. అతనికి ఆ మాటలు సరిగా అర్థం కాలేదు. అయినా ఏదో

తృప్తిగా నవ్వాడు, ఆ మగతలోనే. సుందరం ఆప్యాయత అతని హృదయాని కేదే మందులా ఉంది!

ఈ వ్యక్తి తన్ను వెతుక్కుంటూ, ఇంతదూరం రావడ మేమిటి ? ఈతనికి తనకూ ఏమిటి సంబంధం? కండక్టరు మీా బంధువా అన్నాడు. తనకు, అతనికి ఏమిటి బంధుత్వం? అతని హృదయంలో ఆవేదన ఏదో తనహృదయాన్ని తాకింది. అదే బంధుత్వం. శత్రు వెవరో, మిత్రుడెవరో, బంధు వెవరో, ఏ నిమిషాన ఎవరి రూపు ఎలా మారుతుందో.

ఒక జీవితకాలం రగిలి వేధించిన కోరికలు, నిరాశలు, మమకారాలు ఒక్క క్షణకాలంలో ప్రశాంతంగా అణగి కన్ను మూస్తాయి, శాశ్వతంగా ! జీవితానికి, మరణానికి మధ్య సరళ రేఖ ఎంత అల్పమైనదీ, కంటికి కనిపించనంత ! అనుకున్నాడు సుందరం, అతని కేసి చూస్తూ.

అతని ముఖంలో కలతలన్నీ తీరినట్టు కనిపించాయి. అతను తుపాను అణగిన తరువాత నెలకొన్న ప్రశాంతిలా నిద్ర పోతున్నట్టు కనిపించాడు.